క్లుప్తంగా

పశువులపాక దగ్ధం



దగ్ధమవుతున్న పశువుల పాక

రుద్రవరం: మండలంలోని పెద్దకంబలూరులో ఆదివారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో ఉప్పరి తిమ్మయ్యకు చెందిన పశువుల పాక దగ్ధమైంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో అందరు నిద్రిస్తున్న సమయంలో ఉన్నట్టుండి గ్రామంలోని కొత్త కాలనీలో మంటలు చెలరేగాయి. బాధిత రైతు గట్టిగా కేకలు వేయడంతో అందరూ అటువైపు పరుగులు తీశారు. వెంటనే మంటలను ఆర్పేందుకు యత్నించారు. బోరు మోటార్‌ను ఆన్ చేసేందుకు యత్నించగా అప్పటికే కరెంట్ పోయింది. అయినప్పటికీ కొందరు యువకులు మంటలను లెక్కచెయ్యక పాకలోకి చొరబడి పశువుల తలుగులను తప్పించారు. అయితే ఇంకా ఎన్ని పశువులు లోపల ఉన్నాయో తెలియడం లేదని బాధిత రైతు విలపించాడు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందని వాపోయారు.

ప్రజావ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమాలకు సిద్ధంకండి



పట్టణంలో ట్రాక్టర్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని రైతు కార్మిక సంఘాల నేతలు, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని నూనెపల్లె ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి ట్రాక్టర్లు, బైక్‌లతో భారీ ర్యాలీ మున్సిపల్ కార్యాలయం వరకు నిర్వహించారు. కార్యక్రమానికి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభాకర్ రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు తోటమద్దులు, వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి నరసింహానాయక్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూనతంగా జారీ చేసిన వ్యవసాయ మార్కెట్ల జాతీయ విధాన చట్టం ప్రకారం వ్యవసాయ అధారిత పరిశ్రమాధిపతులు ఎగుమతిదారులు, విదేశీ వ్యాపారులకు అనుకూలంగా మార్పులు చేసిందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని రోజుకు రూ.600తో పాటు 200 రోజులు పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులకు 2013 చట్టాలన్ని అమలు చేసి బాధిత రైతులందరికీ నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు బాలవెంకట్, లక్ష్మణ్, దర్శనం, రత్నమయ్య, చౌడప్ప, రాంబాబు, మార్కు, శివ, సంజీవులు, శివరాం, రాజేంద్ర, కలాంబాబు, జిలానీ బాషా, రంజీత్, ఓబులేసు పాల్గొన్నారు.

అమ్మవారికి పల్లకీ సేవ



పల్లకీలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులను ఆశీనులుగావించి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. పూజల్లో దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

కూటమి అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



కాటసానిని సన్మానిస్తున్న పార్టీ నాయకులు

గడివేముల: కూటమి నాయకుల అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. పార్టీలో వివిధ అనుబంధ విభాగాల పదవులు పొందిన వారు ఆదివారం కాటసానిని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ గడివేముల మండల అధ్యక్షుడు బొంతల మధుసూదన్, జిల్లా సెక్రటరీ యేలంపెల్ల రాంభూపాల్ రెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు వంగాల మహేశ్వరరెడ్డి శాలువాలు కప్పి సత్కరించారు. అనంతరం కాటసాని శివ నరసింహారెడ్డిని కలిసి సత్కరించారు. కాటసాని మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా ఉండటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు పోగుల చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.



జాతీయ జెండాకు వందనం చేస్తున్న జడ్జి వాసు,



నంద్యాల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం,



డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న అధికారులు, సిబ్బంది,



గోస్పాడు పోలీసు స్టేషన్ వద్ద జెండాకు వందనం చేస్తున్న ఎస్ఐ, సిబ్బంది

ఘనంగా గణతంత్ర వేడుకలు

నంద్యాల/(న్యూటౌన్)/(అర్బన్)/(వ్యవసాయం)/గోస్పాడు: 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాలయాలు, సచివాలయాలు, రాజకీయపార్టీల, స్వచ్ఛంద సంస్థల, ప్రజాసంఘాల కార్యాలయాల్లో మూడు రంగుల జెండా ఎగురవేశారు. నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా, అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు ఆధ్వర్యంలో ఎస్పీ కార్యాలయ ఆవరణలో పోలీస్ అధికారులు జెండాను ఎగురవేసి వందనం సమర్పించారు. డీఆర్‌వో కార్యాలయంలో డీఆర్‌ఓ రామునాయక్, వ్యవసాయ శాఖ కార్యాలయంలో డీఏఓ మురళీకృష్ణ, మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ మాబున్నిసా, కమిషనర్ నిరంజన్‌రెడ్డి జెండా ఎగురవేశారు.

రాజ్యాంగాన్ని ప్రతిఒక్కరూ గౌరవించాలి..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని అందరం గౌరవించి నియమాలను పాటించాలని మూడవ అదనపు జిల్లా జడ్జి వాసు అన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా కోర్టు ఆవరణలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి జాతీయ జెండాను ఎగురవేశారు.



కలెక్టర్ కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్



జెండాను ఎగురవేస్తున్న జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా

ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి రాధారాణి, రెండవ అదనపు జిల్లా జడ్జి కిరణ్‌కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి లావణ్య, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఏసుదాసు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, కార్యదర్శి వెంకటేశ్వర్లు, రామచంద్రారావు, జూనియర్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో..

డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం వద్ద డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ ఆధ్వర్యంలో మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. ఇమ్యూనైజేషన్ అధికారి సుదర్శన్‌బాబు, ప్రోగ్రాం ఆఫీసర్ కాంతరావునాయక్, వైద్యులు జగదీష్‌చంద్రారెడ్డి, ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు. నంద్యాల జిల్లా ఆసుపత్రి వద్ద ఆసుపత్రి సూపరింటెండెంట్ మల్లేశ్వరి ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా, మదన్ మోహన్‌రావు, రమేష్, హెచ్ఓడీ డాక్టర్ పద్మజ పాల్గొన్నారు. జిల్లా పంచాయతీ రాజ్ కార్యాలయ ఆవరణంలో జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ అధికారి నాగారాజు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో డీఈఓ జనార్దన్‌రెడ్డి, సమగ్ర శిక్ష కార్యాలయంలో ప్రేమాంతకుమార్ జెండా ఆవిష్కరించారు. రవాణా శాఖ కార్యాలయంలో జిల్లా రవాణా అధికారిణి ఐశ్వర్యారెడ్డి జెండాను ఆవిష్కరించారు. ఎంవీఐ శ్రీకాంత్,సిబ్బంది పాల్గొన్నారు. డీఆర్‌డీఏ కార్యాలయంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, ఎంపీడీఓ సుగుణశ్రీ, ఏఓ షానులు, తహసీల్దార్లు ప్రియదర్శిని, శ్రీనివాసులు ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. డీటీలు రామసంజీవరావు, రామచంద్రారావు, నాగరాజు పాల్గొన్నారు. ఎస్సార్‌బీసీ కాలనీలోనున్న పరివర్తన లైఫ్ సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాల్‌మిల్ అమీర్‌బాషా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

గోస్పాడులో...

స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ ఆర్థర్ సైమాన్, ఉపాధ్యక్షులు జనార్దన్‌రెడ్డి, రాజు, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ షేక్‌మొహిద్దీన్, ఎమ్మార్సీ వద్ద ఎంఈఓ అబ్దుల్‌కరీం, పోలీసుస్టేషన్ వద్ద ఎస్ఐ వెంకటప్రసాద్, విద్యాలయాల్లో రిపబ్లిక్‌డే వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా మువ్వన్నెల జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు. పాఠశాలల్లో సాంస్కృతిక కార్యాక్రమాలు నిర్వహించారు. ఎంపీడీఓ అమానుల్లా, ఈఓఆర్‌డీ అనసూయ, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నారులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాల్‌మిల్ అమీర్ బాషా



దేశ నాయకుల వేషధారణలో ఉన్న చిన్నారులతో ఎమ్మెల్యే అఖిలప్రియ



రుద్రవరంలో విద్యార్థికి బహుమతి అందజేస్తున్న గంధం రాఘవరెడ్డి



ఉయ్యాలవాడ రెవెన్యూ కార్యాలయంలో జెండా ఆవిష్కరించి గౌరవ వందనం చేస్తున్న తహసీల్దార్, సిబ్బంది



చాగలమర్రి: జాతీయ పతాకానికి వందనం సమర్పిస్తున్న తహసీల్దార్ రవికుమార్



బర్డ్స్ పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన

మువ్వన్నెల జెండా రెపరెపలు..

ఆళ్లగడ్డ: భారత 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను నియోజకవర్గంలో ఆదివారం ఘణంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యా సంస్థలలో ఆయా అధికారులు, నిర్వాహకులు త్రివర్ణ పథాకాన్ని ఆవిష్కరించి వందనం సమర్పించి దేశ భక్తి గేయాలు ఆలపించారు. స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ చిరంజీవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ నగీనా, సిబ్బంది పాల్గొన్నారు. కోర్టు సముదాయంలో ఐదవ అదనపు జిల్లా జడ్జి మురళీకృష్ణ, మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే అఖిలప్రియ జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేశారు.

రుద్రవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మువ్వన్నెల జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో ఇప్పటికే నిర్వహించిన ఆటల పోటీల విజేతలకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ మాజీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి బహుమతులు అందజేశారు. కేజీబీవీలో గతేడాది పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించిన ముగ్గురు బాలికలకు బంగారు వ్యాపారి దేవగుడి నజీర్ రూ.5వేలు,రూ.3వేలు, రూ.2వేల చొప్పున నగదు అందజేశారు. ఎంపీపీ బాలస్వామి,మేజర్ పంచాయతీ సర్పంచ్ భైరి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాసులు, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జెడ్పీటీసీ సభ్యురాలు కసాని పుణ్యలక్ష్మిదేవి, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ వెంకటేశ్వర్లు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే గ్రామసచివాలయాల్లో ఆయా పాఠశాలల్లో మండల పరిధిలో అన్ని గ్రామాల్లో ప్రధాన ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచ్‌లు జాతీయ జెండాను ఎగురవేశారు. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహ బహుమతులు, ప్రశంసా పత్రాలను జెడ్పీటీసీ కసాని పుణ్యలక్ష్మిదేవి, నాగమునీశ్వరరెడ్డి, పాలూరు సుబ్రహ్మణ్యం అందజేశారు.

దొర్నిపాడు: తహసీల్దార్ సుభద్ర, ఎంపీడీఓ సావిత్రి, ఏఎస్ఐ రంగయ్య, సహకార కేంద్రాల్లో సీఈఓలు విష్ణు, సుబ్బారావు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో లింగుట్ల వెంకటనాయుడు, గోపాల్‌నాయుడు, నిమ్మకాయల వెంకటరామిరెడ్డి సర్పంచులు శివరామిరెడ్డి, మహేష్, మాధవీలత పాల్గొన్నారు.

శిరివెళ్ల: ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ నాయక్ వసీం, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పుష్పకుమారి, పోలీస్టేషన్‌లో సీఐ వంశీధర్, మేజర్ పంచాయతీలో సర్పంచు సాలమ్మ, యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఇంద్రావతి, శ్రీనివాసులు, గ్రామ పంచాయతీలో సర్పంచు అయ్యలూరి సుభహాన్ జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, ఎస్ఐ చిన్న పీరయ్య పాల్గొన్నారు.

చాగలమర్రి: స్థానిక మేజర్ గ్రామ పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ తులసమ్మ గాంధీజీ, అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, పంచాయతీ కార్యాలయంలో ఇన్‌చార్జీ ఈఓ తాహెర్ హుసేన్, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఐడికె శాస్త్రి, బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మీ, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మొయిన్‌లో ప్రధానోపాధ్యాయుడు శేషాద్రి, వెలుగు కార్యాలయంలో ఏపీఎం నాగమ్మ, ముత్యాలపాడు పశువైద్యశాలలో వైద్యులు సాయిబాబా, ముత్యాలపాడులోని బర్డ్స్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో హెచ్‌ఎం సింధూర, చక్రం కాంప్లెక్స్ వద్ద స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు గౌస్‌బాషా జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు.

మొక్కుబడిగా జెండా ఆవిష్కరణ..

శెట్టివీడు గ్రామ పంచాయితీ కార్యాలయం ఎదుట మొక్కుబడిగా మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. కార్యాలయ భవనం ఎత్తుకంటే తక్కువ ఎత్తులో ఒక కొయ్యకు జెండా ఏర్పాటు చేసి ఆవిష్కరించారు. ఫ్లాగ్ కోడ్‌ను విస్మరించిన సిబ్బందిపై చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు.



ఆళ్లగడ్డలో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న అదనపు జిల్లా జడ్జి మురళీకృష్ణ

జాతీయ జెండాకు అవమానం

ఉయ్యాలవాడ : స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయం ఆవరణలో ఆదివారం గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అయితే ఇక్కడ ఒక రాయిని గోడకు పెట్టి మధ్యలో జాతీయ జెండా కర్రను పాతారు. సరైన రక్షణ ఏర్పాటు చేయకపోవడంతో జాతీయ జెండా ఆవిష్కరించిన కొద్దిసేపటికే ఓ పక్కకు వాలిపోయింది. ఈ దృశ్యాన్ని చూసిన ప్రజలు వెలుగు అధికారులపై మండిపడ్డారు.



ఉయ్యాలవాడ మండల మహిళా సమాఖ్య కార్యాలయం ఎదుట ఏటవాలుగా వాలిన జాతీయ జెండా



శిరివెళ్లలో జాతీయ పతాకాన్ని ఎగరవేస్తున్న ఎంపీపీ నాయక్ వసీం



శెట్టివీడు సచివాలయం ఎదుట కార్యాలయ భవనం కంటే తక్కువ ఎత్తులో ఏర్పాటు చేసిన జాతీయ జెండా



దొర్నిపాడులో జెండా వందనం చేస్తున్న తహసీల్దార్, అధికారులు



ముత్యాలపాడులో ఏర్పాటు చేసిన 300 మీ.జాతీయ జెండా



ఉయ్యాలవాడ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం

సేవలకు సత్కారం



సీఎండీ సంతోష్‌రావు నుంచి అవార్డు అందుకుంటున్న ఏఈ రామయ్య

నంద్యాల(అర్బన్): నంద్యాల డివిజన్ విద్యుత్ శాఖలో ఏఈ, డీఈలుగా విధులు నిర్వహిస్తున్న రామయ్య, నాగరాజు, రమేష్‌కుమార్ కు తిరుపతిలోని విద్యుత్ శాఖ కార్పొరేట్ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు ప్రశంసా పత్రాలు, అవార్డులు అందజేశారు. వారు మాట్లాడుతూ.. నంద్యాల జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సుధాకర్‌కుమార్, డీఈ శ్రీనివాసరెడ్డి ప్రోత్సాహాలతోనే ప్రజలకు సేవలు అందించామని చెప్పారు.

వాసవీ మాతకు మహా పుష్పయాగం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక మెయిన్ బజార్‌లో వెలసిన అమ్మవారిశాలలో వాసవీ దీక్షను పురస్కరించుకొని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరికి ఆదివారం మహాపుష్ప యాగం అధ్యక్షుడు ఇనుగూరి రమేష్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే మహిళలు చెరువు కట్ట నుంచి జలాన్ని తీసుకొచ్చి స్వామి, అమ్మవార్లకు అభిషేకం చేసి పుష్పయాగ దాతలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. అమ్మవారికి వివిధ రకాలైన ఫల, పుష్ప, సుగంధ ద్రవ్యాలు, పంచామృతాభిషేకాలు జరిపించి వివిధ రకాల పుష్పాలతో విశేషాలంకరణగావించారు. అనంతరం మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తుఇని పురవీధుల్లో గ్రామోత్సవం, దీపోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి లడ్డూ వేలం పాట నిర్వహించారు. శ్రీవాసవీ ఆర్యవైశ్య సంఘం, శ్రీవైశ్య యువజన సంఘం, శ్రీవాసవీ యూత్ క్లబ్, వాసవీ మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.



అమ్మవారికి మహాపుష్పయాగం నిర్వహిస్తున్న దృశ్యం

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునని వెల్లడించారు. రెవెన్యూ కార్యాలయంలో జరిగే కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

ఉక్కు పరిశ్రమ కోసం ఉద్యమం

నంద్యాల(న్యూటౌన్): కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసేంత వరకు ఉద్యమం కొనసాగిస్తామని దేశంలో ప్రత్యామ్నాయ శక్తిగా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అవతరిస్తుందని నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీ సుందర్‌రామరాజు పేర్కొన్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని శ్రీ వివేకానంద ఆడిటోరియంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, పింఛన్లు, పక్కా గృహాలు, ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజునాయుడు, జయవర్ధన్, సుబ్బమ్మ, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

మందకృష్ణకు పద్మశ్రీ ఇవ్వడం హర్షణీయం

నంద్యాల(అర్బన్): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ఇవ్వడంపై నంద్యాల జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు గంగాధర్‌శెట్టి, కార్యదర్శి ఇంతియాజ్ ఆధ్వర్యంలో మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. నాయకులు రాజు, కరీముల్లా, చక్రీ, శాంతరాముడు, స్వాములు పాల్గొన్నారు.



మిఠాయిలు పంచుకుంటున్న దివ్యాంగులు



పూర్ణాహుతి గావిస్తున్న భక్తులు, అర్చకులు



ముగిసిన హోమాలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో లోక కల్యాణం కోసం ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీ సుదర్శన యాగం, సుబ్రహ్మణ్య యాగాలకు ఆదివారం పూర్ణాహుతినిచ్చారు. ఉదయాన్నే స్వామి వారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం యాదవల్లి కార్తికేయ శర్మ బృందం ఆధ్వర్యంలో యాగాలకు పూర్ణాహుతి గావించారు. వారు మాట్లాడుతూ 21 హోమగుండాలు ఏర్పాటు చేసి 300 మంది దంపతులతో ఐదు రోజులపాటు భక్తి శ్రద్ధలతో సుదర్శన శ్రీసుబ్రహ్మణ్య యాగం నిర్వహించామని చెప్పారు. దేశం సుభిక్షంగా ఉండేందుకు హోమాలను జరిపించామన్నారు.